# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 21 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు జరగనున్నాయని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.
- ❖ దేశవ్యాప్తంగా జనాభా గణన 2027 మార్చి 1 నుండి ప్రారంభం కానుంది.
- ❖ రక్షణ రంగంలో సాంకేతిక సహకారాన్ని పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడానికి భారత్ ఆస్ట్రేలియా అంగీకరించాయి.
- ❖ అమర్‌నాథ్ యాత్ర జులై 3న ప్రారంభం కానుంది.
- ❖ ఐపీఎల్-2025 విజయోత్సవాల్లో ఈ రోజు జరిగిన తొక్కిసలాటలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు.

=========================

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 21 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఢిల్లీలో ఈ రోజు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశమై వర్షాకాల సమావేశాల తేదీలను ఖరారు చేసింది. ఈ సమావేశం వివరాలను కిరణ్ రిజిజు వెల్లడిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

ఇదిలా ఉండగా 23 రోజుల పాటు జరిగే పార్లమెంటు సమావేశాలలోకీలకమైన బిల్లులను కూడా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నట్లుగా అధికార వర్గాలు పేర్కొన్నాయి.

=========================

దేశవ్యాప్తంగా జనాభా, కుల గణన రెండు దశలలో జరగనునందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ రోజు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ భారీ స్థాయి గణనకు తాత్కాలిక షెడ్యూల్‌ను ప్రభుత్వం నిర్ణయించిదని పేర్కొంది. 2027 మార్చి 1 నుంచి దేశ వ్యాప్తంగా జనాభా గణనతో పాటు కుల గణన కూడా ప్రారంభంకానున్నది. అయితే జమ్ముకశ్మీర్,

లడఖ్, ఉత్తరాఖండ్‌లో 2026 అక్టోబర్ నుంచే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. సాధారణంగా ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జాతీయ గణన నిర్వహించి జనాభా రిజిస్టర్ (ఎన్పీఆర్)ను పునరుద్ధరిస్తారు. 2011లో జరిగిన చివరి జన గణనలో దేశ జనాభా 121 కోట్లకుపైగా నమోదైంది. గత పదేళ్లలో జనాభా 17.7 శాతం మేర పెరిగిందని అధికార వర్గాల అంచనా. మరోవైపు షెడ్యూల్ ప్రకారం 2021లో జనాభా గణన చేపట్టాల్సి ఉంది. అయితే కరోనా మహమ్మారి కారణంగా ఇది వాయిదా పడింది. తాజా జనాభా గణనలో కుల గణనను కూడా చేర్చడానికి రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార - ప్రసారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గత ఏప్రిల్లో ప్రకటించారు.

========================

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్ న్యూ ఢిల్లీలో ఈ రోజు కలుసుకున్నారు. భారత్ - ఆస్ట్రేలియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ఆలోచనలను ఇరువురు ఈ సందర్భంగా పంచుకున్నారు. ఉగ్రవాదంపై పోరాడుతున్న భారత్ కు ఆస్ట్రేలియా  తరపున రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్ మద్దతు ప్రకటించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆస్ట్రేలియాలో లేబర్ పార్టీ ఘన విజయం సాధించినందుకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

========================

రక్షణ రంగంలో సాంకేతిక సహకారాన్ని పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడానికి భారత్ ఆస్ట్రేలియా అంగీకరించాయి. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలో ఈ రోజు  ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్ల్స్ తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షణ రంగంలో సాంకేతిక సహకారం పెంపొందించుకోవాలని వాటికి సంబంధించిన ప్రాజెక్టులపైన  చర్చించాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా, ఈ చర్చల సందర్భంగా ఇరువురు నేతలు పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించారు. బాధితుల కుటుంబాలకు సానుభూతిని ప్రకటించారు. ఈ వివరాలను రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ వెల్లడిస్తూ....

(వాయిస్ 29 సెకన్లు)

========================

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో రక్షణ రంగంలో ప్రముఖులకు విశిష్ట సేవల పురస్కారాలను అందించారు. ఈ  కార్యక్రమంలో సందర్భంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్, రక్షణశాఖ మంత్రి రాజ్ నాధ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విరామం

========================

ఈ సంవత్సరం అమర్‌నాథ్ యాత్ర జులై 3న ప్రారంభమై... ఆగస్ట్ 9వ తేదీ వరకూ కొనసాగనుంది. జులై 3వ తేదీన తొలి దశలో యాత్రికులు శ్రీనగర్ నుంచి బస్సుల్లో ఈ యాత్రకు బయలుదేరి వెళ్లనున్నారు. హిమాలయాలలో దాదాపు 3,880 మీటర్ల ఎత్తులోని అమర్‌నాథ్ గుహలో శివలింగాన్ని దర్శించుకునేందుకు ఇప్పటికే వేలాది మంది భక్తులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. కాగా, జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్రకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను కేంద్ర ప్రభుత్వం చేయనుంది. అమర్‌నాథ్ యాత్రికుల భద్రత కోసం “ఆపరేషన్ శివ”ను కేంద్ర ప్రభుత్వం చేపట్టనుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.  ఈ అమర్‌నాథ్ యాత్ర సమయంలో ఆ మార్గంలో హై అలర్ట్ కొనసాగించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే ఉన్నతాధికారులను స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సైతం ఈ యాత్ర భద్రతపై ఉన్నతాధికారులతో ఇప్పటికే సమీక్షా సమావేశాలను నిర్వహించారు.

========================

ఐపీఎల్-2025 (IPL-2025) ట్రోఫీ గెలుచుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) జట్టు విజయోత్సవాలు విషాదాంతమయ్యాయి. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్దకు అభిమానులు భారీగా తరలిరావడంతో తొక్కిసలాట జరిగి 10 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 24 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో కొంత మంది పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూ (ICU)లో చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా 18 సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత ఆర్సీబీ జట్టు ఐపీఎల్ ట్రోఫీ గెలిచింది. ఈరోజు ఆ జట్టు అహ్మదాబాద్ నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరుకు చేరుకుంది. నగరంలోని చిన్నస్వామి స్టేడియంలో వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఇందులో పాల్గొనేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కొందరు బారీకేడ్లను, పోలీసులను తోసుకుని స్టేడియం వైపు దూసుకెళ్లారు. దాంతో వారిని అదుపు చేయలేకపోవడంతో తొక్కిలసాలట జరిగింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద చోటు చేసుకున్న తొక్కిసలాటపై కర్ణాటక ప్రభుత్వం స్పందించింది. తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్ క్షమాపణలు చెప్పారు.

========================

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రేపు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ న్యూ ఢిల్లీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అధికార వర్గాలు తెలిపాయి. 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా భగవాన్ మహావీర వణస్థలీ పార్క్ వద్ద మొక్కలు నాటుతారని పేర్కొన్నారు. పర్యావరణ సమతూల్యతను కొనసాగించడంతో పాటు మొక్కలు నాటే సంస్కృతిని ప్రజలలో పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని ప్రచారం చేస్తోంది.

========================

ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర నిధులలో ఉన్న వాటాను 50 శాతానికి పెంచాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ డిమాండ్ చేశారు. ఈ రోజు రాష్ట్ర రాజధాని లాక్నోలో 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ డి. అరవింద్ పనగారీయాతో పాటు సభ్యులతో ఆయన సమావేశం జరిపి అనేక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల గురించి ముఖ్యమంత్రి ఆర్థిక సంఘం సభ్యులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో విస్తృతమైన అభివృద్ధి దృష్ట్యా అధిక నిధులు అవసరం అవుతాయని యోగి అదిత్యనాథ్ అన్నారు. ప్రస్తుతం రాష్ట్రాలకు 41 శాతం వాటా మాత్రమే ఉందని దానిని ఉత్తర ప్రదేశ్ వరకూ అయినా యాభై శాతంగా పెంచాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టంగా చెప్పారు.

========================

దేశంలో వయోవృద్ధులకు గౌరవనీయమైన జీవితాన్ని అందించేందుకు సమగ్రమైన జాతీయ విధానం రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ అధ్యక్షతన న్యూఢిల్లీలో ఈ రోజు వయోవృద్ధులకు సంబంధించిన జాతీయ మండలి 4వ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో ప్రతి వయోవృద్ధునికీ గౌరవం దక్కాలన్నదే ప్రభుత్వ విధానమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 2047 నాటికి వృద్ధులు భారతీయ జనాభాలో 20 శాతం ఉంటారని ఈసమావేశం అంచనా వేసింది. వారు ఏ విదంగానూ నిర్లక్ష్యానికి గురి కాకుండా ఉండేలా చూడాలన్నది  ప్రభుత్వ ఆలోచనగా సమావేశం పేర్కొంది. వృద్ధుల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించడం, వృద్ధాశ్రమాల ఏర్పాటుకు చొరవ చూపడం వంటి చర్యలు చేపట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

========================

========================